# సంస్కారం!

శ్రీ ధనిష్ఠ

వేణుకి మనశ్శాంతి లేకపోయింది. అదేపనిగా గోపాలంమాటల జ్ఞాపకానికొస్తున్నాయి. ఆ పశుప్రాయుడు అన్నది పార్వతినిగురించే.

ఎంతో ఆనందంగా గడపాలని ఆశించిన సెలవు రోజున సగంలోనే దెబ్బలాట ఎదురైంది. ఆలోచనలు ఉక్కిరిబిక్కిరిచేస్తున్నాయి. ఈ పార్వతిని గురించి కాకపోతే ఆ హాస్యాన్ని తానూ 'ఎంజాయ్' చేసేవాడేమో...మాటలసందర్భంలో ఎప్పుడో తాను కుటుంబాన్ని గురించి స్నేహితులతో అన్నాడు. అది పట్టుకుని గోపాలం అలా అనేసరికి తనకి వెర్రెత్తిపోయింది.

మూడు నెలల్క్రితం తనీ యింట్లో రూంలో ప్రవేశించాడు. గతసంవత్సరం పిఠాపురం హాస్టల్లో రూముకి పదిమందివంతున ఉండి చదువు సాగక నానా తంటాలుపడి పరీక్ష తప్పుతుందేమో అనేస్థితికి వచ్చింది. అందుకే యీ యేడు హాస్టలికి స్వస్తి చెప్పి చినవాల్తేరులో యూనివర్శిటీకి దగ్గర అని చెప్పి అట్టే సదుపాయాలు లేకపోయినా యిరవై రూపాయలకి యీగది తీసుకున్నాడు. ఇక్కడ తనకి బాగానే ఉంటోంది. ఇంటాయన పేరు జగన్నాథంగారు. ఎక్కడో గుమాస్తాగిరీ వెలగబెడుతున్నాడు. ఇల్లు చిన్నదైనా జీతం పరిపోక తనకోగది యిచ్చాడు. ఈమూడు నెల్లలోను వాళ్ళ మాటలవల్ల తనకి తేటపడినది: పార్వతి జగన్నాథం గారి మేనగోడలనీ, తలిదండ్రులు లేరనీ, దానికి తోడు వైధవ్యం ప్రాప్తించి అటు అత్తారికీ ఏమీ లేకపోవడం వల్ల చాకిరీ చేస్తూ యిక్కడ పడిఉందని. సుభద్రమ్మగారి గొంతుక ఎంత మృదువైనదంటే—పిల్లల్ని గాని పార్వతిని గాని ఆమె తిట్టు లేకుండా సంబోధించదు. జగన్నాథంగారే ఆమెనోటికి దడుస్తాడు. ఆమెకు పార్వతి తమయింట ఉండడం ఒకలా యిష్టమూ ఒకలా అయిష్టమూను. ఆమె చేసే చాకిరీ ఆమెకు యిష్టమే. అయితే ఆమెకు తిండీ బట్టా తామివ్వవలసి రావడంమాత్రం అయిష్టం. తనపాలిట శనిలా దాపురించిందని తిడుచు అంటుంది. పార్వతి పెదవి కదపదు. ఈమూడు నెల్లలోను తను పెరటిలోకి రోజూ వెడుతూనే ఉన్నా ఏ నాలుగైదుసార్లో మాత్రం పార్వతి లీలగా కనబడింది. నిండా పద్దెనిమిదేళ్ళుండవామెకు. నిశ్చింతగా ఎక్కడో సంసారం గడుపుతూండవలసిన ఆమెగతి యిల్లా అయింది. ఇంకా జగన్నాథంగారు మంచివాడనే చెప్పాలి - యీ మాత్రం పోషించడమే ఘనత యీ కాలంలో. ఇదీ పార్వతి కథ. రోజూ తనకి ఆమె తియ్యనికంఠం మాత్రం వినబడుతుంటుంది. ఆమె అంటే తనకి తగని జాలి. అయితేమాత్రం చెయ్యగలిగిన దేముంది? ఇంకా దేశంలో యిల్లాంటి వారెందరున్నారో!

తనంటే జగన్నాథంగారికి గురి. ఎందుకంటె తాను అల్లరిచిల్లరివేషాలు వెయ్యడు. రెండోది: తాను నెల తిరక్కుండానే అద్దె యిచ్చెయ్యడమేకాకుండా అడపాదడపా బదుళ్ళుకూడా యిస్తాడు. తనకు ఆయనకు ఎటువంటి పేచీ రాలేదు.

ఈ ఆలోచనలతో అటు దొర్లి యిటుదొర్లి ఎప్పుడో నిద్రపోయాడు వేణు.

నాలుగున్నరకు మెలకువ వచ్చింది. బద్ధకంగా కళ్లు తెరచి యిటు ఒత్తిగిలితే ఒళ్ళంతా నొప్పిగా అనిపించింది. లేచి ముఖం కడుక్కుని రూముకి తాళం వేసి యివతలపడ్డాడు. కాళ్ళు నెప్పిపెట్టాయి. క్రిష్ణా కేఫ్‌కివెళ్ళి ఆకలి లేకపోయినా అలవాటుగా దోసెతిని కాఫీ తాగాడు. హాస్టలు వేపు వెడదామనుకుని గోపాలంగాడి ముఖం ఎదురౌతుందేమోనని ఆ కోరికను ఉద్వాసన చెప్పాడు. అందుచేత చల్లగాలికోసమని బీచ్‌కి బయలుదేరాడు.

పోలీసు స్టేషన్ పక్కనించి సీవ్యూ హోటల్ ముందున్న తార్రోడ్డమ్మట B N R రెస్ట్‌హౌస్ దాటి కాలిబాటలోపడి "పామ్ బీచ్" బంగళా పక్కనున్న తాటితోపుల మధ్యనించి సముద్రపుటొడ్డు చేరుకున్నాడు.

ఇసకలో చతికిలపడ్డాడు. ఎదురుగా నురుగులు కక్కుకుంటూ విరిగిపడే కెరటాలతోను, హోరు పెడుతూను ఉండే నీలికడలి. చూపానినంతమేర కంటికింపు గూర్చే నీలిరంగు. ఆకాశంతో సముద్రం ఎక్కడో చేతులు కలుపుతున్నట్టే ఉంటుంది. కుడి పక్కకి దూరంగా వంపుతిరిగినఒడ్డు. ఎరాడకొండ, డాల్ఫిన్స్‌నోస్ కనబడుతున్నాయి. ఎడం పక్క

'లాసన్స్'లోని కనబడకుండా చేస్తూ నీటి అంచుకు చొచ్చుకుపోయిన శాంతక్షేత్రమంకోంచ.

చూసి తనివితీరని ఆనందంతో రోజూ పరవశమై పోయే వేణుకి యివాళ యివన్నీ శూన్యంగా కనబడుతున్నాయి. అతని మనస్సు ఆ దృశ్యంమీద లగ్నం కాలేకపోయింది. అతని మనస్సు అదేపనిగా ఆలోచిస్తోంది. అదివరకెన్నడూ ఆలోచించని పార్వతి అతని ఊహాలను నింపింది. గోపాలం నోటిమీదుగా ఆమె పేరు రావడమే అందుకు కారణం.

నిర్గంధ కుసుమంలా ఆమె జీవితం వెళ్ళమారిపోవాలి. జీవితంలోని ఏ ఆనందం అనుభవించకుండానే ఆమె బ్రతుకు అంతం పొందుతుంది. మానవులలోని సహజమైన కోరికలకు ఆమె ఏనాడైనా లొంగిపోతే వేశ్యావాటికే ఆమెకు ఆశ్రయం కావలసిరావచ్చు. అదీ కాకపోతే బండచాకిరీతో మొగ్గబారిపోయి నడివయస్సులోనే వార్ధక్యానికో, దీర్ఘరోగానికో ఎరకావచ్చు. ఆమెకు పునర్వివాహం చెయ్యడానికెవరు పూనుకుంటారు? కట్న కానుకలు లేకుండా ఆమెను చేపట్టే దెవరు? ఆమె ధనహీనురాలు, మాతాపితృ విహీనురాలు. ఆమెను ఆదరించేవారు లేరు. సానుభూతి చూపించేవారు లేరు. అనునయించేవారు లేరు. సుభద్రమ్మగారు ఆమె మీద అధికారం చెలాయించడం మాత్రమే చేస్తుంది. జగన్నాథంగారి మనస్సులో ఏమున్నా భార్యనోటికి దడిసి ఊరుకుంటాడు. ఆమె జీవితానికి నిష్కృతి ఎల్లా?

తానామెను ఉద్ధరిస్తే? గోపాలం అన్నదాన్ని నిజం చేస్తే?

తనతండ్రి చండశాసనుడు. సనాతన ధర్మాల్ని జీర్ణించుకుని దానికే మురిసిపోతాడు. మొండిపట్టుదల వాడు. ఇటువంటివి కలలోకూడా అంగీకరించడు.

ఆలోచనలతో కాలం తెలియలేదు వేణుకి.

చీకటి పడింది. నల్లటి చీరమీద మెరుగు కోసం అద్దిన అభ్రకపు నలుసులులా మెరుస్తున్నాయి నక్షత్రాలు. కడలి హోరుతప్ప అంతా నల్లగా కనబడుతూంది. కంటికింపు కూర్చిన నీలిరంగు నలుపుగా మారిపోయింది.

ఉలిక్కిపడిలేచి నిలుచున్నాడు వేణు.

కాళ్లు తడబడ్డాయి. కళ్లు మంటలు. తలతిరుగుతున్నట్లనిపించింది. నడుద్దామంటే అడుగుపడటం లేదు. అతికష్టంమీద చీకట్లో దారి తడుముకుంటూ రోడ్డెక్కాడు. గది చేరుకోగలనా అనిపించిందతనికి. ఎల్లాగో రూంకి వచ్చి పడ్డాడు.

మంచంమీద పడుకున్నాడే గాని ఎప్పుడు వాంతి అవుతుందో అనిపించింది. అన్నం ఏమాత్రమూ అరగ లేదు. వికారం, జ్వరం వచ్చేశాయి. దుప్పటి ముసుగు పెట్టుకుని పడుకున్నాడు. ఏదో తెలియని బాధ. మగతగా కళ్ళు మూశాడు.

ఎక్కడనించో నూతిలోంచి వస్తున్నట్టు "వేణుగారూ" అన్న తియ్యని కంఠం వినిపించింది. బలవంతంగా కళ్లు తెరిచాడు. వీధి దీపం కాంతివల్ల కిటికీలోనించి వీధిలో వస్తువులు మసగ్గా కనిపిస్తున్నాయి. గదంతా చీకటే; కలగాబోలు ననుకున్నాడు గాని పైన పార్వతికంఠం తన్ను మళ్ళా పిలుస్తూ వినిపించింది. ఎక్కడా యింకా అలికిడి లేదు; టిక్కు టిక్కుమనే బిగ్‌బెన్ తప్ప. రేడియం పెయింట్ వేసిన ముళ్ళు పన్నెండు గంటలని తెలియజేస్తూ ఒక దానిమీద ఒకటి ఉన్నాయి అబ్బ! పన్నెండే! అనుకున్నాడు. ముక్కులోంచి జ్వరతీవ్రతవల్ల వేడిగాలి వస్తోంది.

పైన మళ్ళీ పార్వతికంఠం. తూలిపోతూ వెళ్ళి తలుపుతీశాడు. తలుపుతోసుకుని పార్వతి లోపల అడుగుపెట్టింది. తలుపులు దగ్గిరగా వేసింది. వేణు అతికష్టంమీద మంచం చేరుకున్నాడు.

"జ్వరం వచ్చిందా?" అని నుదుటిమీద చల్లటి చెయ్యి ఉంచి, అంతలోనే "అమ్మో కాలిపోతోంది" అంది.

"మీ రెలా వచ్చారు?" వేణు అడిగాడు.

"ఇప్పుడే మెలుకువ వచ్చింది. మీ మూలుగు వినిపించింది."

"గట్టిగా మూలిగానా?

"ముందు మీరు పడుకోండి. మీ చిరిగిన పంచలేమైనా ఉన్నాయా?" మెల్లిగను, మృదువుగాను ప్రశ్నించింది.

"ఆ పెట్టెలో ఉంటాయి."

బెడ్‌లైట్ వేసి పెట్టెదగ్గర కెళ్ళి లోపలనించి చిరిగినపంచె తీసి చింపి చెంబులోని నీళ్ళలోముంచి పిడిచి వేణునుదుట వేసింది.

"మీ కెందుకీ శ్రమ?" అని "యింక వెళ్లండి ఫరవాలేదు." అన్నాడు వేణు.

ఆమె కదల లేదు. అయిదు నిమిషాల తరవాత గుడ్డతీసి మళ్ళీ నీళ్ళలోముంచి పిడిచి నుదుటిమీద వేసింది.

"మామయ్యని లేపి డాక్టరు దగ్గరకు పంపనా?" అంది, ఆమే మళ్ళీ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"వద్దు. రేపటికి అదే తగ్గిపోతుంది."

మళ్ళీ నిశ్శబ్దం.

"మీరు వెళ్ళండి. మీ అత్తయ్య చూస్తే ఏమనుకుంటారు?" అన్నాడు వేణు.

"వాళ్ళంతా నిద్రపోతున్నారు. వాళ్ళమాట అటుంచి మీరేమనుకుంటున్నారు?" మెత్తగా అన్నా కత్తులలా దూసుకుపోయాయి ఆ మాటలు వేణు హృదయంలోంచి. అణిగి ఉండి మెత్తగా కనిపించిన పార్వతిలో కొత్తలోతు లేవో కనబడ్డా యతనికి.

"నిస్సహాయస్థితిలో ఉన్న రోగిమీద దయదల్చిన కరుణాస్వరూపిణి అనుకుంటున్నాను." అన్నాడు వేణు నిండుదనంతో.

"ధన్యవాదాలు." అన్న ఆమె కంఠంలో తడి కనబడింది.

"ఆమాట నే ననాలి." అన్నాడు వేణు.

"మీరు పడుకోండి. నిద్ర వచ్చేదాక నే నుంటాను." అంది అతనిమాట వినిపించుకోనట్టు.

"నాకు నిద్రపట్టదు. చికాకుగా ఉంది. మీ రనవసరంగా శ్రమపడకండి. వెళ్ళండి. నాగురించి మీరు నిందలపాలు కావడం నాకిష్టం లేదు."

"నే నెలాగూ వెళ్ళక తప్పదు. ఈలోపున నిద్ర తెప్పించేందుకు ప్రయత్నించండి."

"వాంతి అయేటట్టుంది."

"అయితే జాగ్రత్తగా అరుగుమీదకు వెళ్ళగలరా?"

"ప్రయత్నిస్తాను." అని కాంప్ కాట్ దిగి తూలుతూ వెళ్ళి అరుగుమీద కూలబడ్డాడు.

"నేను మళ్ళా వస్తాను." అంటూ ఆమె లోపలకు వెళ్ళింది.

రెండు పెద్ద వాంతులు వెళ్ళాయి. పొద్దున్న తిన్న వెజిటబుల్ పులావు, మధ్యాహ్నం తిన్న దోశ, యింకా అన్నం, అన్నీ వెళ్ళిపోయాయి. గుండెల్లో మంట బయలుదేరింది కాని కడుపు కాళీకావడంతో కొంత నయమనిపించింది. వాంతులనించి తేరుకుని మళ్ళీ పడుకు నేసరికి ఆమె తిరిగి వచ్చింది.

"చప్పుడుకి యింట్లోవాళ్ళు లేస్తారేమోనని భయం కొద్దీ లోపల కెళ్ళాను." అంది ఆమె.

ఏం సమాధానం చెప్పడానికీ తోచలేదు వేణుకి. అరగంటవరకు ఆరారగా తడిగుడ్డలు వేణు నుదుటిమీద వేసి అతనికి నిద్రపట్టగానే యింట్లోకి వెళ్ళిపోయింది పార్వతి.

మొన్నాడు పొద్దున్నకి జ్వరం కొంత తగ్గింది. తొమ్మిదిగంటలకు జగన్నాథంగారు ఆఫీసుకు వెళ్ళబోతూ వేణుగది యింకా తెరిచే ఉండడం చూసి లోపలకి వచ్చారు.

"అదేం అలా ఉన్నారు? జ్వరం వచ్చిందా?" అని అడిగారు పడుకుని ఉన్న వేణుని చూసి.

"అబ్బే. రాత్రి కొంచెం పులకరం తగిలింది. అంతే."

"అరె. మమ్మల్ని లేపకపోయారా? పదండి డాక్టర్ దగ్గరకి వెడదాం." అన్నారు.

"అబ్బె! వద్దండి. సగం తగ్గిపోయింది," మొహమాటపడ్డాడు వేణు.

"అయితే నేనే మందు పట్టుకొస్తానులెండి." అన్నా రాయన.

డిస్పెన్సరీనించి మందు, బత్తాయిపళ్ళు, హార్లిక్స్ అవీ తెచ్చి, యింట్లో వేణ్ణీళ్ళు కాచించి ఫ్లాస్కునిండా పోయించి తన విధి నెరవేర్చుకున్నారు జగన్నాథంగారు.

ఆవాళరాత్రి పార్వతి మళ్ళీ వచ్చి తనయోగక్షేమం కనుక్కుంటుందని ఆశించిన వేణు ఆశ నిరాశ అయింది.

మూడోనాటికి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. జగన్నాథంగారు పథ్యం తమ యింటిలోంచి తినిపించారు.

పథ్యంతిన్న రోజు నే ఎందుకు లెమ్మని ఆరోజు రాత్రిభోజనం మానేశాడు వేణు. భోజనం చెయ్యక పోవడంచేత కడుపు కాళీగా ఉండి నిద్రపట్టలేదు. పుస్తకం తీసుకుని చదువుతున్నాడు.

ఇంట్లో అలికిడి తగ్గింతరవాత పార్వతి వచ్చింది.

"జ్వరంపూర్తిగా తగ్గిందా?" అడిగింది.

"మీ దయవల్ల." అన్నాడు వేణు.

"రేపు మీ రింటికి వెళ్ళిపొండి." అంది పార్వతి.

"ఏం?"

"కాస్త ఆరోగ్యం కుదుటపడేవరకు యింటి పట్టున తిండి తినడం మంచిది." అంది.

"అల్లాగే మీ రెంతవరకు చదువుకున్నారు?"

"అల్లా అడుగుతున్నా రేం?" ఆశ్చర్యపోతూ అడిగింది పార్వతి.

"చెప్పండి." అన్నాడు మళ్ళీ, ఆమె ప్రశ్నని ఉపేక్షిస్తూ.

"తెలుగురాయడం చదవడం వచ్చు." అంది.

"అభివృద్ధిచేసుకుందుకు ప్రయత్నిస్తున్నారా?"

"తీరి కేది?"

"మీ మామయ్యతో చెప్తాను మెట్రిక్ కి కట్టడానికి ప్రయత్నిస్తారా?"

"ఎక్కడ కుదురుతుంది! అయినా అవన్నీ ఎందుకు చెప్పండి. ఇలాగడిచిపోతే చాలదూ?"

"ఎందుకు ఆత్మవంచన చేసుకుంటారు? జీవితం అంతా యిలాగే గడిపేస్తారా?"

"అందని మానిపండ్లకి అర్రులు చాచమంటారా?"

"అది కాదు నేననేది ప్రయత్నిస్తే సాధ్యం కాని దేదీ ఉండదు. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకుని ఎందరినో ఉద్ధరించొచ్చు."

"లేనిపోని ఆశలు పెంచుకుంటే యీమాత్రం శాంతీ ఉండదు." అంది నిర్లిప్తంగా పార్వతి.

"నాకు తోచినది చెప్పాను. పైన మీయిష్టం. నా సహాయానికి లోటుండదు."

"ధన్యవాదాలు. కాని మీరు మాత్రం రేపెంటికి వెడతారు కదూ?"

"అల్లాగే."

పార్వతి వెళ్ళిపోయింది.

మొన్నటి సుభద్రమ్మగారి ధుమధుమలు మరింత ఎక్కువయ్యాయి. పార్వతిమీద మండిపడు తూంది.

కాలేజికివెళ్లి గంట తరవాత నీరసం అనిపించి రూంకి వచ్చేశాడు వేణు.

సుభద్రమ్మగారి ఇంట్లోంచి వెక్కి వెక్కి ఏడుపు వినిపిస్తోంది. సుభద్రమ్మగారు కంఠం సాధ్యమైనంత తగ్గించి నానామాటలు అంటోంది. మధ్య మధ్య తన పేరు వస్తోంది.

"నాకళ్ళుకప్పి యిదా నువ్వాడుతున్న నాటకం? ఎన్నాళ్ళనించి సాగుతోంది యీ వ్యవహారం? మీ మామయ్యతో చెప్పి యిదేమిటో యివాళే తేల్చేస్తాను. మా పరువు మర్యాదా మంట కలిపేస్తావా? దౌర్భాగ్యురాలా! దిక్కులేక మాయింట పడుండి మాకే అప్రతిష్ఠ తెస్తావా? వాడిసంగతి నీసంగతి యివాళే తేలిపోవాలి." అంటోంది.

"నాకే పాపం తెలీదత్తయ్యా నీ పాదాల సాక్షి. నన్ననుమానించకత్తయ్యా." దీనంగా ఏడుస్తూ అంది పార్వతి.

"నీకేం తెలీదేం! సంగనాచీ! అర్ధరాత్రి వాడి గదిలో నీకేం పని?"

పార్వతి మాట్లాడలేదు.

వేణురక్తం ఉడుకెత్తింది. తనమూలంగా నిర్దాక్షిణ్యమైన హింసకు గురి అవుతూంది పార్వతి. అది అతను సహించలేకపోయాడు. స్త్రీ పురుషు లిద్దరిని ఎప్పుడూ అనుమాన దృక్కులోంచే చూసే సమాజం అంటే అసహ్యం వేసింది. అర్ధరాత్రి తనగదిలో అడుగు పెట్టినంతమాత్రాన ఆమె చేసిన తప్పేమిటో ఎంత తన్నుకున్నా అర్థం కాదు. సీరియస్ గా జగన్నాథం గారింట్లోకి వెళ్ళాడు.

వేణుని చూసిన సుభద్రమ్మగారు తొట్రుపడింది.

"ఆగండి. ఆమె ననవసరంగా బాధించి అవమానించకండి. ఆమె చేసిన తప్పు ఒక్కటే. అది జ్వరంతో బాధపడుతున్న నన్ను కనికరించడమే. ఇప్పటికి మీరామెను పెడుతున్న బాధలు చాలు. ఇంకా కోసిపెట్టకండి." అన్నాడు.

"మాయింటికి వచ్చి నువ్వెవడివయ్యా మమ్మల్నన డానికి? మాయింట్లో మాయిష్టం వచ్చినట్లనుకుంటాం. నీకెందుకు మధ్య. అయినా నువ్వుమాత్రం తక్కువ తిన్నావా? నిన్నుమాత్రం వదిలి పెడతా మనుకోకు. ఇటువంటి వాడివంటే అసలు యిల్లు యిచ్చకే పోదుము. ఇల్లా ఎంతమంది కొంపలు కూలుస్తున్నావో" అంటూ రుద్రకాళిలా అరిచింది సుభద్రమ్మ.

"నోటికొచ్చినట్టు మాట్లాడకండి. అందులో ఎవరు చేసిన తప్పూ ఏమీలేదు. మీ అనుమానం తప్ప యిక్కడ కొంపలేం మునిగిపోలేదు. మీ రెవర్నీ ఏమీ అనక్కర్లేదు. ఆమెను నేను పెళ్లి చేసుకుంటాను." అన్నాడు వేణు.

సుభద్రమ్మగారు, పార్వతికూడా కొయ్యబారి పోయారు. పార్వతి తేరుకుని అంది:

"ఉద్రేకంలో ఏదోచేసి నాకోసం మీరు బాధపడవద్దు. నాబ్రతుకెలాగా నాశనం అయింది. నన్నిలా ఉండనివ్వండి."

"పార్వతీ నేను మనఃపూర్వకంగా చెప్తున్నాను. నన్ననుమానించి అవమానించకు."

"మీరు చెయ్యదల్చుకున్నదానికి నా అంగీకారంకూడా కావాలనేమాట మర్చిపోకండి."

"పార్వతీ!"

"మీరు తొందరపడి నాకోసం మీ జీవితాన్ని త్యాగం చెయ్యడం నేను అంగీకరించను."

"పార్వతీ! ఆత్మవంచన చేసుకోవద్దని బతిమాలు తున్నాను.

పార్వతి ఏమీ మాటాడలేదు.

వేణు ఏమీ మాట్లాడలేక బైటకు వచ్చేశాడు.

ఆవేదనతో మధు దగ్గరకెళ్లి అంతా వివరించాడు.

"వేణూ! ఆమె చెప్పినట్లు నువ్వే తొందరపడు తున్నావేమో" అన్నాడు అంతా విని మధు.

"మధూ! నీకు పుణ్యం ఉంటుంది. నన్నిలా చంపకు. ఇంతవరకు వచ్చింతరువాత ఆమెను అధోగతి చెయ్యలేను. నేనేమైపోయినా . రే. ఎదైనా జరిగితే యిద్దరు కలిసే అనుభవిస్తాం ఆమెగతికి ఆమెను విడిచి నా జన్మలో సుఖించలేను. నీ సహాయం కావాలి. అంటూ అతిదీనంగా మొరపెట్టుకున్నాడు.

మధు కరిగిపోయాడు.

ఇద్దరూ జగన్నాథంగారింటికి వచ్చారు.

సాయంకాలం యింటికివచ్చి అంతా తెలుసుకున్న జగన్నాథంగారు నవ్వాలో ఏడవాలో అర్థంకాక తికమకపడ్డారు.

"మీరన్నది నిజమేనా?" అని అడిగాడు వేణుని.

"అక్షరాల..." అన్నాడు వేణుతరఫున మధు.

ఆయనకు ఆనందంవల్లనో విషాదం వల్లనో గాని కళ్లనీళ్లు నిండుకొచ్చాయి.

"మా పార్వతి అదృష్టవంతురాలు నాయనా." అన్నప్పుడు మాత్రం ఆయనకంఠంలో పట్టలేక ఆనందమే ధ్వనించింది.

పార్వతిని ఒప్పించడానికీ బ్రహ్మాండం తలక్రిందులైంది.

పట్టుదలవల్ల, పరిస్థితుల ఒత్తిడులవల్ల తొందరపడిన వేణుకి అడుగడుగునా సమస్యలే అయ్యాయి. ఇంతవరకు జరిగిన తరువాత పెళ్లి వాయిదా వేస్తే వెయ్యి అనుమానాలకు, లక్ష అఘాయిత్యాలకు దారితీస్తుంది. పెళ్లి అనే రెండక్షరాల పదానికి 'లీగల్ స్టేటస్' ఎంతో ఉంది.

మొట్టమొదట తండ్రికి తెలియజెయ్యడమా, మానడమా అన్నది. ఒక్కడే పుత్రుడు కావడంవల్ల ఆయన మెత్తబడే అవకాశాలున్నా అది ఊహగా మాత్రమే నిల్చిపోవచ్చుననడానికీ ఎక్కువ ఆధారమే ఉంది. చదువు నడిసముద్రపు నావలా ఉంది. ఆరునెల్లలో కోర్సు అయిపోతే వచ్చే ఉద్యోగానికీ, యింతతో ఆపేస్తే వచ్చే ఉద్యోగానికీ యోజనాల వ్యత్యాసం ఉంది. తండ్రికి తెలియజేసి ఆయన నిజంగానే మొండిపట్టు పట్టి వ్యతిరేకిస్తే తన జీవితపథంలో ముళ్లమొక్కలు ప్రత్యక్షమౌతాయి. చదువు మధ్యలో ఆగిపోవడమే కాకుండా అసలు పెళ్లికే ఆటంకం వస్తే పార్వతి జీవితం బలిఅయిపోతుంది.

ఆఖరికి మిత్రబృందం అంతా ఆలోచించి ఒక పథకం తయారుచేశారు. పెళ్లి చేసుకుని తండ్రికి తెలియనివ్వకుండా, చదువు సాగిస్తూ తండ్రిపంపే సొమ్ముతోనే సంసారం సాగనియ్యడం.

పుట్టెడు బలగం ఉండి తలిదండ్రుల కొక్కడే మగబిడ్డఅయి, కావలసిన వాళ్లంటూ ఎవరూ లేకుండా జీవితంలో మరో అధ్యాయం ఆరంభించడం, ఎంత కష్టం తోచినా, వేణుకి తప్పలేదు.

తండ్రి ఎంత మండిపడతాడో అనిగాని, తల్లి తన్ను చేజేతులా పెళ్లికొడుకుని చెయ్యలేకపోయానే అని ఎంత విచారిస్తుందో అనిగాని, అన్న పెళ్లి తనకు తెలియకుండా అయిపోయిందే అని చెల్లెళ్లు ఎంత బాధపడతారో అనిగాని లక్ష్యపెట్టడానికి వీలులేని యిరకాటకంలో పడిపోవలసివచ్చింది వేణు.

స్నేహితులే చుట్టాలుగ, రిజిస్ట్రారు ఆఫీస్ దైవసన్నిధిగా, రిజిస్ట్రారే పురోహితుడిగా అగ్నికంటే శక్తిమంతులైన సాక్షుల సమక్షాన పార్వతి వేణూల పెళ్లి ముగిసింది.

తండ్రి స్థితిపరుడు కావడంవల్లా, తను పెద్ద చదువు చదువుతుండడంవల్లా నెలకు రెండువందల తెప్పించుకోగల తాహతుగల వేణుకు పార్వతి బరువు కాలేదు.

ఇల్లొకటి అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. జీవితం మూడుపువ్వులు ఆరుకాయలు అనిపించింది. తనకరించికదా తలితండ్రులకు వేరై అజ్ఞాతవాసం గడుపుతున్నాడు వేణు అని పార్వతి అనుకుని "నాకోసంగదా మీకిన్ని కష్టా"లని వేణుతో అనడం, "ఛా అల్లా అనకు" అంటూ వేణు ఆమెనోటిని తన పెదవులతో మూయ్యడం, ఆ సంసారంలో నిత్యసంఘటనలై పోయాయి.

పరీక్షలు దగ్గరకురావడంచేత సంక్రాంతి సెలవులకు యింటికిరాలేనని వేణు తలిదండ్రులకు వ్రాశాడు. కాబోలుననుకుని సమాధానపడ్డారు తలిదండ్రులు బాధపడుతూనే. తత్కారణంగా అనుమానాలకు ఆస్కారం, ఆలుమగలకు వియోగం తప్పిపోయాయి.

మేలో పరీక్షలయిపోవడం అప్పటికే పార్వతి గర్భం ధరించడం జరిగాయి. నెల్లాళ్ళు కలకత్తాలో ట్రైనింగు ఉందని తండ్రికి రాసి మరో రెండువందల డబ్బూ, మరో నెల్లాళ్ల గడువు పొందాడు వేణు.

కాలం గడుస్తున్నా ఎటువంటి తుపానులో చిక్కుకుంటుందో యీ జీవితనౌక అని యిద్దరికీ భయంకలుగుతున్నా ఒకరికొకరు ధైర్యం చెప్పుకునేవారు.

వంశోద్ధారకుడు ఉదయించబోతున్నాడన్న వార్తగాని, అసలు పెళ్లయిందనే సంగతిగాని తలిదండ్రులకు తెలియజెయ్యలేకపోతున్నానే అనే వేణు ఎంత మథనపడ్డా చెయ్యగలిగిందేమీ లేకపోయింది.

జూన్ ఆఖరకు ఒకసారైనా తలిదండ్రులకు ముఖం చూపించక తప్పని పరిస్థితి ఏర్పడింది వేణుకి. కొత్తపథకం ఏంవెయ్యాలా అని ఆలోచించి "రిసెర్చి" వంక పెట్టి ఉద్యోగం వచ్చేవరకు తండ్రి ధనంమీదనే ఆధారపడదలిచాడు వేణు. నాలుగు రోజులలో తిరిగి వస్తానని పార్వతికి మాటయిచ్చి యింటికి బయలుదేరాడు వేణు.

సంసారం హడావిడిలో పడి చదువు సన్నగిల్లి ఫస్టు క్లాసులో వస్తాడనుకున్న వేణు సెకండ్ క్లాసులో మాత్రమే వచ్చాడని తలిదండ్రులు అనుమానించలేదు. ఏదో గట్టెక్కాడని సంతోషించారు.

ఇంటికి రాగానే తను పథకంలో వేసుకోని కొత్తసమస్య ఒకటి ఎదురు కావడంతో బిత్తర పోయాడు వేణు.

ఇంటికి వచ్చిన రెండో రోజున భోజనాలదగ్గర వచ్చింది ప్రస్తావన. తను, తండ్రి పక్క పక్క భోజనాలకు కూర్చుండగా — "సాయంకాలం బండికి యిద్దరూ వెళ్ళి ఆ పిల్లని చూసిరండేం." అన్నాడు తండ్రి తన్నుద్దేశించి తల్లితో ఆ ఊరు పేరేదో చెప్పి.

వేణుగుండెల్లో రాయి పడింది.

"అబ్బాయి నడగండి..." అంది తల్లి.

"చూసిరావడానికి వాణ్ణడిగే దేమిటి?" అన్నాడు తండ్రి.

"ఏరా నాన్నా?" తన్నడిగింది తల్లి.

"నా కిప్పుడప్పుడే పెళ్ళి వద్దమ్మా!" అన్నాడు తండ్రి కాబోతున్న వేణు.

"ఎన్నాళ్ళని కూర్చుంటావురా? 'బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా—'అని—ఇదివరకటి దాక అంటే పోనీ చదువు అయిపోవాలన్నావు. ఇప్పుడది అయింది. ఇంకా ఎన్నాళ్ళు?" గద్దించాడు తండ్రి.

"అబ్బా! వాణ్ణలా హడలగొట్టేస్తా రేమిటి? మీనించే వాడసలు సెలవులకి రావడం కూడా మానుకుంటున్నాడు—నాన్నా! ఇదివరకూ నీమాటే కానిచ్చాంగా—ఆడపిల్ల లెలాగూ అత్తారిళ్ళకెళ్ళిపోతారుగదా యింట్లో నే నొకత్తని—పోనీ ఆ కోడలు పిల్లయినా వస్తే యిల్లు నిండుగా ఉంటుంది. నీ కడుపున నాలుగు కాయలు కాస్తే యింట్లో చంటిపిల్లలు లేని లోటు కూడా తీరుతుంది." అంది అటు భర్తని మందలిస్తూ, యిటు కొడుకుని లాలిస్తూ.

వేణుకి అటువంటి తండ్రిని వంచించినందుకెంత ఆనందమైందో, ఇటువంటి తల్లిని మభ్యపెట్టినందుకు అంతబాధ వేసింది. కాని ఏమీ మాట్లాడలేదు.

"ఏరా బాబూ!" అంది తల్లి మళ్ళీ.

"నువ్వలా మెత్తబడబట్టే వాడలా నెత్తికెక్కుతున్నాడు. చదువుకున్నవాడుగదా పదిసార్లు చెప్పించుకోవాలా?" తండ్రి గదమాయించాడు.

"ఇంకా రెండేళ్ళు రిసెర్చి చెయ్యాలని ఉంది." అన్నాడు వేణు.

"అదేదో పెళ్ళయ్యాక కానియ్యి..." అన్నాడు తండ్రి.

ఈ నాన్సుగు వ్యవహారం చూసి తల్లికి అనుమానం వేసింది.

"నా డప్పుడే ఎవర్నన్నా చూసుకున్నాడేమో?" అంది.

"అయితే ఆ ముక్క చెప్పొచ్చుగా? ఎవరు? ఏవూరు?" అడిగాడు తండ్రి.

భోజనాలై బైటకువచ్చేసిం తరువాత అన్నింటికీ తెగించి చెప్పేశాడు వేణు.

తల్లి తల్లక్రిందులైంది. సంతతధారగా కన్నీళ్ళు స్రవించింది. కాని తేరుకుంది.

తండ్రిమాత్రం అపరభార్గవుడే అయిపోయాడు.

"ఛండాలుడా! మేం చచ్చామనుకున్నావా? ఇంకా ఏ ముఖంపెట్టుకుని వచ్చావ్ యింటికి. వెధవ ముండని పెళ్ళాడావా? నీ కింకేం గతిలేకపోయిందా. నా ఎదుటనించి పో. ఇంక జన్మలో నీముఖం చూపించకు. నాకడుపున చెడబుట్టావు. నాదంతా స్వార్జితం. నా ఆస్తిలో కానీ ముట్టకుండా చేస్తాను. నాకు నీళ్ళు వదిలే హక్కులుకూడా పోగొట్టుకున్నావు. పో బైటకి!" గర్జించాడు.

"అర్థంలేని ఆచారాల్ని పట్టుకు దేవులాడే అవసరం నాకు లేదు నాన్నా. నీ ఆస్తిలో కానికి గూడా నేను ఆశించటంలేదు. నన్నింతవాణ్ణి చేసినందుకు జీవితాంతం కృతజ్ఞుడిగా ఉంటాను. ఏనాడైనా నువ్వు మనస్సు మార్చుకుంటే తెలియజెయ్యి." అన్నాడు వేణు స్థిరంగా.

"బాబూ!" అంటూ ఆక్రోశించింది తల్లి యీ పరిణామాలకి తట్టుకోలేక.

"క్షమించమ్మా. నాకు మనఃపూర్వకంగా మంచిదని తోచింది గనకే చేసుకున్నాను. పెళ్ళి అనేది నా వ్యక్తిగత సమస్య. దాన్ని పరిష్కరించుకోవడం నేనే చెయ్యాలి. మీకు తెలిస్తే విచారిస్తారనే తెలియజెయ్యలేదు." అన్నాడు వేణు.

తల్లి గొంతుక మూగపోయింది.

"వస్తానమ్మా." అంటూ పాదాభివందనం చేశాడు.

"సుఖంగా వర్ధిల్లు నాయనా." అంది కన్నీళ్ళతో.

అటు తిరిగి ఉన్న తండ్రికి అక్కడినించే నమస్కరించి బైటపడ్డాడు.

దావాలో సర్వస్వం పోగొట్టుకున్న వాడిలా ముఖంపెట్టుకువచ్చిన వేణుని చూసిన పార్వతిముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేకపోయింది.

"ఏమైంది?" ఆత్రంతో అడిగింది.

"ఏమీ కాలేదు" ఉదాసీనంగా అన్నాడు వేణు.

"చెప్పరూ!" ఆర్ద్రంగా వేణు ముఖంలోకి చూస్తూ అడిగింది.

"అమ్మ క్షమించింది పారూ."

"మరి మామయ్య ఏమన్నారు?"

"ఆయన అంగీకరించలేదు."

"అంతేనా!"

"అంతే. కాకపోతే ఆస్తిలో చిల్లిగవ్వ యివ్వనన్నారు. తనకింక ముఖం చూపించవద్దన్నారు."

"నావల్లనేగా మీకష్టాలన్నీ. అయినవాళ్ళందర్నీ, ఆస్తినీ వదులుకున్నారు— కాని ఒక్కటి మీరు ముందే తెలుసుకుని ఉండవలసింది. మునిగిపోతున్న వాణ్ణి రక్షించడానికి ప్రయత్నించిన వాడుకూడా అపాయంలో చిక్కుకుంటాడనే విషయం—నిర్భాగ్యురాల్ని. నాతోపాటు మిమ్మల్నికూడా అగచాట్ల పాలు చేశాను." అంటూ వాపోయింది.

"ప్రపంచం ఏమైపోయినా నువ్వుంటే చాలు పారూ. నిన్ను నిందించుకుని నన్ను బాధపెట్టకు." అన్నాడు వేణు ఆమెను కౌగిలిలోకి తీసుకుంటూ.

తండ్రి పంపించే డబ్బు ఆగిపోవడంతోను, ఉద్యోగం దొరక్కపోవడంతోను గట్టునపడవేసిన చేపలా అయిపోయింది వేణుపని. తనొక్కడే రెండు వంటలు తెప్పించుకుని శ్రీమంతుడిగా వెలిగిన వాడిప్పుడు చేత చిల్లి కాని లేకుండా కనబడిన స్నేహితుడిదగ్గరల్లా అప్పుతీసుకుని గడపవలసివచ్చింది.

ఎంతో ప్రయత్నించి ఎన్నో సిఫార్సులు చేయించినమీదట నెల్లాళ్ళకి లోకల్ కాలేజీలో డిమాన్‌స్ట్రేటర్ పోస్టు దొరికింది. అమాంబాపతులు నూటనాలుగు రూపాయల జీతం.

తక్కువ అంతస్తులో బ్రతికినవాడికి ఎక్కువ వస్తే లాభం, ఆనందమూను. అదే ఎక్కువలో బ్రతికిన వాడి బ్రతుకు దిగజారిపోతే యమయాతనలకు గురి కావలసివస్తుంది. హెచ్చుస్థాయికి అలవాటుపడిన జీవితం ఒక్కసారిగా తక్కువలోకి పడలేదు. ఆదాయం ఎటువున్నా ఖర్చులు మాత్రం అవుతుంటాయి.

పదిహేనో తారీఖుకల్లా జీతం అయిపోయేది. ఆపైన దొరికినచోటల్లా అప్పుచెయ్యడం జీతం రావడంతోనే సగం డబ్బు అప్పులు జమకట్టడానికే సరిపోవడం జరుగుతుండేది. వేణు సిగరెట్లు మానేసేడు. సినిమా అన్నది మర్చిపోయాడు. దరఖాస్తులు పెట్టడానికి కూడ డబ్బులేక ఉద్యోగాలకు దరఖాస్తులు వెయ్యలేక నిస్సహాయంగా ఊరుకునేవాడు. దీనికి తోడు రోజులు గడిచే కొలది పార్వతికి పురిటిరోజులు దగ్గరపడేవి.

అక్టోబరు యిరవై రెండో తారీఖు—

పార్వతికి తొమ్మిది నెలలు నిండాయి. రేపో మాపో పురుడు వచ్చేటట్టుంది. పక్కవాటాలో ఉన్న ఆవిడ లేడీ డాక్టరుకు చూపించమని సలహా యిచ్చింది. అసలే మొదటికాన్పు. ఇద్దరికీ అనుభవం తక్కువ. వేణుకి మతిపోయింది. తోడెవ్వరూ లేరు. చేతిలో పైసా లేదు. ఏంచెయ్యడానికీ తోచలేదు. నెలాఖరు రోజులు కావడంతో ఎక్కడా అప్పు దొరకలేదు. ఏం అమ్మివేద్దామనుకున్నా ఖరీదైన వస్తువులు కనపడలేదు.

"పారూ ఎల్లావుంది?" అని అడిగాడు వేణు ఏమీతోచక.

"ఏమో ఎందుకో భయంగా ఉంది." అంది పార్వతి.

"పక్కింటి ఆవిడ లేడీ డాక్టర్ కి చూపించమంది. తీసుకురానా?" ఎల్లా తీసుకురావాలనేది సమస్య అనే తేలీలేదు అతనికి.

"ఎక్కడినించి తీసుకువస్తారు. డాక్టరు ఊరికే వస్తుందా? డబ్బేది?" నిర్లిప్తంగా నవ్వింది పార్వతి.

అప్పుడు తెలిసివచ్చిందతనికి తనకి తెలియని ఎన్నో సమస్యలున్నాయని. తన నిస్సహాయతకి దుఃఖం పొంగింది. అది తండ్రిమీది కోపంగా మారింది. ఆ ఘన మూర్ఖుడు కావడంవల్లనేకదా తనకి అన్నీ ఉండి దరిద్రం అనుభవించవలసి వస్తోంది?

ఆముక్క అన్నాడు పార్వతితో.

"పాపం! ఆయన్నెందుకంటారు. మీరు చేజేతులా తెచ్చిపెట్టుకున్నదిది. అష్టైశ్వర్యాలతో తులతూగే యింట్లో పుట్టారు. పువ్వులా బ్రతికారు. ఎంతో చదువుకున్నారు. నాలాంటి నిర్భాగ్యురాల్ని కట్టుకోవడంచేత అన్నీ ఉండికూడా అవస్థలు పడుతున్నారు." అన్న పార్వతి కంఠం బాష్పగద్గదమైంది.

"వద్దు పారూ! అట్లా అనకు. నీవల్లే నాకీ మాత్రం సుఖమైనా ఉంది. కాని నిన్నేదో ఉద్ధరిస్తానని తీసుకువచ్చి కష్టపెడుతున్నాను. లేని ఆశల్ని నీలో కల్పి నిన్నీ గతికి తీసుకువచ్చాను."

"ఎంత పిచ్చివారండి!—పోన్లెండి యింక మాట్లాడను—మిమ్మల్ని నొప్పించను. కాని ఒక్కటి మాత్రం గ్రహించండి. ఈ క్షణంలో నా ప్రాణం పోయినా, యీ యేడది సాహచర్యం, మీ సాన్నిహిత్యం నాజీవితానికి చాలు."

"ఏమిటి పారూ! ఆ పాడుమాటలు — ఇంతకీ యిప్పుడు డాక్టరుగారేమిటిట?" అన్నాడు వాస్తవ ప్రపంచంలోకి మళ్ళీ వచ్చి.

"బండి తీసుకు రండి జనరల్ హాస్పిటల్ కి వెళదాం."

"అక్కడ గంటలతరబడి నిరీక్షించాలి."

"అయితేమాత్రం తప్పుతుందా; డబ్బు లేనప్పుడు."

"పోనీ అమ్మేద్దామంటేనూ ఖరీదైన వేవీ లేవు. ఒక వెండికంచమైనా—ఆగు. అన్నట్టు వాచీ అమ్మేస్తే ఒక నూరురూపాయలైనా వస్తాయి. ఈ విషయం యిన్నాళ్ళు గుర్తుకి రాకపోవడం నా అదృష్టం. లేకపోతే యీపాటికే అయిపోయి ఉండును."

"వాచి అమ్మేస్తారా!"

"మంచిరోజులొచ్చినప్పుడు మళ్ళీ కొనుక్కుందాం పారూ."

తండ్రి తన పుట్టినరోజుకు బహుమతి యిచ్చిన వాచీ అది. అప్పుడు మూడువందలు పెట్టి కొన్నాడు. ఆ రకం వాచీధర యిప్పుడు విపరీతంగా పెరిగిపోవడం వల్ల పాతవాచీకే రెండువందల చిల్లర వచ్చింది.

ఆ రోజున ఆ రెండువందలు అతనికి రెండు లక్షలలా అనిపించాయి. పెన్నిధి దొరికినట్లు ఆనందించాడు.

చేతిలో డబ్బుంటే మనిషి రాజే! అనుకున్నవన్నీ క్షణాలమీద జరిగిపోయాయి. డాక్టర్ వచ్చింది. చూసింది. రెండుమూడురోజుల్లో పురుడు వస్తుందనీ, భయం లేదనీ చెప్పింది,

ఇరవై ఆరో తారీఖున పార్వతి సుఖప్రసవమై మగబిడ్డను కన్నది. పొత్తిళ్ళల్లో బిడ్డను చూసుకుని మాతృమూర్తి అయిన పార్వతి ముఖంలో గర్వం, ఆనందం వెల్లివిరిశాయి. వేణు సంతోషానికి అవధులు లేకపోయాయి.

కష్టాలొచ్చినా, సుఖాలొచ్చినా వరసగానే వస్తాయి. పుత్రోదయంతోపాటు వేణుకు అదివరలో ఎప్పుడో అప్లైచేసి ఆశవదులుకున్న లెక్చరర్ పోస్టుకు పిలుపువచ్చింది. భార్యాపుత్రసమేతంగా బెజవాడ చేరుకున్నాడు వేణు, కొత్త ఉద్యోగంలో చేరడానికి.

వందరూపాయలలో గడుపుకుని ఎల్లాగో అల్లా కాలక్షేపంచేసిన ఆ ప్రాణాలకి రెండువందలు రావడంతో కాస్త చెయ్యితిప్పుకుందికి వీలైంది. ఎండిపోయిన జీవితం మళ్ళీ చిగిర్చింది.

ఒకరోజున వేణు చేతిలో ఒక పార్శెల్ తో యింటికి వచ్చాడు.

గుమ్మంలో బాబునెత్తుకుని చిరునవ్వుతో స్వాగతం యిచ్చిన పార్వతిబుగ్గన చిటికెవేసి పార్శెల్ ఆమెచేతికిచ్చి బాబు చేతులోకి తీసుకున్నాడు.

"ఏమిటిది? పుస్తకాల్లా ఉన్నాయే" అంది పార్వతిపాకెట్ విప్పుతూ.

"అవును మెట్రిక్ పుస్తకాలు." అన్నాడు వేణు.

"ఎందుకు?"

"నువ్వు పరీక్షకు కట్టడానికి."

"మీకు వెర్రా ఏమిటి! పిల్లడి తల్లిని నాకిప్పుడు చదువేమిటండీ?" నవ్వుతో పాటు ఆశ్చర్యంకూడా ప్రదర్శించింది పార్వతి.

"చదువుకి వయస్సేమిటే ముసలమ్మా! ఏరా బాబూ?" తన విట్టుకి తనే నవ్వుకుని బాబుని ఎగరేసి చేతులలోకి పట్టుకున్నాడు.

"అరె! ఏమిటి వాణ్ణలా ఎత్తికుదేస్తారు? పొరపాటున చేయిజారెనా—" వాక్యం పూర్తి చెయ్యలేకపోయింది.

"నువ్వే కన్నావుటే వాణ్ణి! నాకేమీ కాడూ. ఏరా బాబూ నువ్వు మీ అమ్మ కొక్కర్తికేనా కొడుకువి!" అంటూ కొడుకుని పార్వతికిచ్చి యిద్దర్నీ చేతుల్తో చుట్టేశాడు.

పార్వతి అనిర్వచనీయమైన ఆనందంతో పులకించింది. కౌగలివిడిపించుకుని,

"ఇవాళ హఠాత్తుగా పరీక్ష గొడవ పట్టిందేం మీ మనస్సుకి?" అని అడిగింది.

"ఒక్కొక్కప్పుడు నాకు పిచ్చిగా ఆలోచనలు వస్తుంటాయి—రాత్రి ఏదో పీడకల వచ్చింది. నాకేదైనా అయితే—అని ఆలోచిస్తే గుండె ఆగిపోయింది. నిజంగానే నాకేదైనా అయితే బాబుకి నీకూ ఆధారం ఎవరు పారూ? నీకాళ్ళమీద నువ్వు నిలబడగలిగితే నాకేబాధా ఉండదు. అనుకోని అసహాయస్థితి వచ్చినా నాబాబుకి అడుక్కుతినవలసిన గతి తప్పుతుంది." అంటుంటే అతని కంఠం గాద్గదికం వహించింది.

"అటువంటిమాటలని నన్నెందుకు హింసిస్తారు చెప్పండి" ఏడ్చింది పార్వతి. క్షణంక్రితం ఉజ్జ్వలంగా వెలిగినముఖం నల్లగా అయిపోయింది.

"నిజంగా ఆలోచించి చూస్తే ఏముంది పారూ! మాటలకి అంటున్నానని అనుకోకు. ఏ క్షణానికేం వస్తుందో ఎవ్వరం చెప్పలేం. నామాట కాదనకు పారూ!" అన్నాడు వేణు.

ఇంక ప్రసంగం పెంచినకొద్దీ అశాంతి ఎక్కువ కావడం తప్ప ప్రయోజనం లేదని గ్రహించిన పార్వతి కొడుకుని గుండెల కదుముకుని,

“మీ కిప్పుడే కాఫీ పట్టుకువస్తా నుండండి.” అని బాబుని వేణు కిచ్చి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పదినిమిషాలతరువాత తడిగా ఉన్న ముఖంతో ట్రేతో కాఫీఉప్మా తీసుకువచ్చి బల్లమీద పెట్టి పక్కనే నిలబడింది పార్వతి.

“ఎల్లుండిలోగా ఎగ్జంషన్ ఫీజు కట్టాలి. ఏమంటావు నువ్వు? నీకిష్టమైతే చెప్పు. లేకపోతే ఏమీ లేదు.” అన్నాడే గాని ఆమె అంగీకారం అయిపోయిన భావమే కనబడింది అతని ముఖంలో.

అది గ్రహించి “మీమాటే కానీండి” అంది పార్వతి.

“నువ్వు దొరకడం నా అదృష్టం పారూ!” అన్నాడు వేణు.

అది మొదలు పార్వతి విద్యాభ్యాసం వారి దినచర్యలో భాగమైపోయింది. ఇటు బాబుని చూసుకోవడం, అటు వంటా, మరోకపక్క చదువు ఆమెకు అధికశ్రమ కలిగించినా వేణుని నిరుత్సాహపరచడం యిష్టంలేక ఆమె చదువులో శ్రద్ధ కనబరిచింది.

వేణు ఆమెకు చదువుచెప్పే బాధ్యత స్వీకరించాడు. రోజూ ఆమెకు పాఠాలు చెప్పి ఒక్కొక్కప్పుడు విసుక్కుంటూ, మరోకప్పుడు లాలిస్తూ ఆమెను చదివించసాగాడు. సహజంగా తెలివితేటలుగలది కావడంవల్ల ఆమె కృషి వేణు పట్టుదలవల్ల ఫలించింది.

* * * *

బలహీనత అనేది మానవసహజం. అసలు బలహీనతంటూ లేనివారు లక్షకొక రుంటారో లేవో. ఇది వివిధరూపాలలో ఉంటుంది. వ్యక్తిమనస్తత్వం మీదా, పుట్టిన వాతావరణమ్మీదా, చుట్టుఉన్న పరిస్థితులమీద ఆధారపడుతూ వివిధపరిణామాలని పొందుతూంటుంది.

కొందరు అప్రత్యాశితంగా ఉపకారాలుచేస్తారు. వీరు ఉపకృతిపొందినవారినుండి కృతజ్ఞతకూడా ఆశించరు. ఉపకారం చెయ్యడం తమ విధి అనుకుంటారు. కొందరు స్వార్థంకోసం చేస్తారు. ఫలానా విషయంలో వాడికి సాయంచేస్తే మరోచోట నాకిలా లాభిస్తుంది అనే దృష్టేప్రధానం వారికి. మరికొందరు కేవలం కీర్తికోసం చేస్తారు. ఎదుటివారి మన్ననకు పాత్రులు కావడమే వారి లక్ష్యం. ఇటువంటివారిలో ఒక బలహీనత ఉంటుంది. తమనించి ఉపకృతిపొంది కృతజ్ఞత కనబరచని వాళ్ళని వాళ్ళు క్షమించలేరు. తమవల్ల సహాయం పొందినవారు తమపట్ల సదా భయభక్తులతో మెలగాలని ఉంటుంది వీరికి. అల్లా కాక తమ నెదిరిస్తే గతంలో తమవల్ల పొందిన ఉపకారాన్ని గుర్తుకుతెచ్చి ఎదుటివారి కృతఘ్నతను ఎత్తిచూపుతారు.

ఏ బలహీనత అయినా, అన్ని పరిస్థితులలోను విజృంభించదు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు అణిచి ఉంచబడినా, పరిస్థితులు అనుకూలించగానే వృద్ధి పొంది పోతుంది; శరీరంలో బలం ఉన్నంతవరకు అణిగి ఉండి బలం తగ్గగానే విజృంభించే సూక్ష్మజీవులలాగే.

అయిదేళ్లు గడిచేసరికి వేణు పార్వతుల జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆమె యిప్పుడు గ్రాడ్యుయేటు. అతనికి ప్రమోషన్ వచ్చింది. కాపురంపెట్టిన కొత్తలో జీవితంలో ఏదో ఘనకార్యం చేసినవాడిలా భావించుకొనేవాడు వేణు. దారిద్ర్యాన్ని ఎదిరించడంలో, కష్టాలకి నిలదొక్కుకోవడంలో ఒకరి కొకరు సానుభూతి చూపుకుంటూండేవారు. ఆమెపట్ల అతనికి అమితమైన జాలీ, ప్రేమా ఉండేవి. ఆమెకు అతనో దైవంలా కనబడేవాడు. అదీకాక దారిద్ర్యంవల్ల యితర విషయాలు ఆలోచించడానికి తీరిక ఉండేదికాదు. రోజులుగడవడంగురించె ఆలోచించేవారిద్దరూ. అందుకే ఆకాలంలో వారిద్దరు ఒకరి మనస్తత్వాన్ని గురించి మరొకరు ఎప్పుడూ తర్కించుకోలేదు. కాలంగడిచే కొలదీ పరిస్థితులు చక్కబడడంతో ఆ అవకాశం లభించింది.

పార్వతి మానవాతీత కాలేదు. భర్తకు గౌరవం యిచ్చి అతన్ని మనఃపూర్వకంగా ప్రేమించగలదు. వేణు తనని ఉద్ధరించినందుకు కృతజ్ఞత చూపించగలదు కాని అది కారణంగా తీసుకుని అణిగిమణిగి పడి ఉండడంమాత్రం ఆమెకుగిట్టదు సాటి స్త్రీలందరిలాగే భర్తజీవితంలో అర్ధాంగిగాను, బాధ్యతగల సహచరిగాను ఉండాలని ఆమెవాంఛ. తమ యిద్దరి మంచికీ ఉపకరిస్తుందనే విశ్వాసం కలిగితే ఒక్కొక్క విషయంలో అతన్ని ఎదిరిస్తుంది ఎదిరించవలసివస్తే, మరుక్షణమే గౌరవిస్తుంది, పూజిస్తుంది.

ఈవిషయం సహజంగానే వేణు గ్రహించవలసింది. కాని అతను గ్రహించలేక అపోహపడేవాడు. అంచేతే రోజులు గడచేకొలది ఎంతో ఆదర్శస్త్రీ అనుకున్న పార్వతి అతనికి అతిసామాన్యవనితగా కనబడజొచ్చింది. అదీకాక తనకాళ్ల మీద తను నిలబడ్డగలిగిన పరిస్థితి రావడంవల్ల పార్వతికి గర్వం బలిసిందేమోననే యింకో అనుమానం అతనికి తోడయింది. పార్వతికి స్వయం (పోషక) శక్తి లేనప్పుడైతే తన్నెదిరిం

-చినా యీఅనుమానం ఉండకపోయి ఉండదు వతనికి. తలిదండ్రుల నెదిరించి, సమాజాన్ని ధిక్కరించి, పార్వతిని పెళ్లాడి తాను బావుకున్న దేమిటా అనే ఆలోచన వచ్చేది. అంతర్నీ కాదని ఆదర్శాలకోసం ఆమెను చేపట్టిన అతని అహం దెబ్బతింది. అతని బలహీనత బలపడడానికి తోడై గృహచ్ఛిద్రాలకు దారితీసింది.

ఇంట్లో చీటికీ మాటికీ కయ్యాలు వచ్చేవి. ఒకరినొకరు ఎదిరించుకునేవారు. మొదట్లో పార్వతి ఊరుకున్నా వేణు ఊరుకోకపోవడంవల్ల అవి ఆమెకూ అలవాటై పోయాయి. వాదనలు చరమస్థాయి అందుకున్నప్పుడల్లా ఆఖరి అస్త్రంగా గతాన్ని గుర్తుకు తెచ్చి ఆమె నోరు మూయించేవాడు వేణు.

బాబంటే యిద్దరికీ ప్రాణమే. కాని ఎప్పుడైనా విసుగువస్తే బాబును అదిలించేది పార్వతి. వేణు ఆమెమీద మండిపడేవాడు. వాణ్ణి సమర్థించి పార్వతిని దించెయ్యడంవల్ల సహజంగానే బాబుకి తల్లి లోకువ అయ్యేది. రానురాను ఇదేవిషయం యిద్దరిమధ్యా ఎక్కువ పేచీలకి దారితీసేది. ఎవరూ తగ్గిపోయేవారు కాదు. వాదోపవాదాలు జరిగేవి ప్రతివిషయానికీ. అసలంటూ కలతలు రాకనేపోవాలిగాని వచ్చింతరువాత ఎంత సర్దిపోయినా మరో విషయం మీద పేచీలు వచ్చినప్పుడు పాతగాథలు తవ్వుకోకమానరు. తాడు తెగేదాకా లాగనేకూడదు. లాగిం తరువాత తెగితే చేసేదేమీ ఉండదు.

వేణు తన బలహీనత మీద పదేపదే ఒత్తిడి తేవడం పార్వతి సహించలేకపోయింది. సంసారంలో అతనికున్న పాటి బాధ్యత తనకూ ఉంది. అతను కష్టపడి సంపాదించి తెస్తుంటే తాను కష్టపడి యిల్లుదిద్ది అతనికి సంతోషం చేకూర్చ ప్రయత్నిస్తున్నది. ఆ బాధ్యత గుర్తెరగడంవల్లే తను జీవితం హాయిగా నడవడానికి ఉపకరిస్తుందన్న సలహా తాను యిస్తుంది. అవసరమయితే వాటి లాభనష్టాలను గురించి వాదిస్తుంది. అతనిమాటే అక్షరాల గుడ్డిగా తానవలంబించలేదు. అది తన తత్వంలో లేదు. గతిలేక మామయ్యగారింట పడిఉన్న స్థితికి యిప్పటికి తేడా ఉంది. అప్పుడు తాను కేవలం ఒకరిమీద ఆధారపడివుంది. ఇప్పుడు తాను తమ జీవిత శకటానికి ఒక చక్రంలాంటిది. అంచేతే మాటిమాటికీ వేణు "నే నుద్ధరించకపోతే నీపనేమయ్యేది!" అని తన బలహీనతమీద ఒత్తిడం ఆమెకు విరక్తి కలిగించింది.

వేణు మనస్తత్వం మరోకోణంలోంచి చూస్తే స్వార్థసంచితంగా కనబడిం దామెకు. కేవలం సంస్కారంమీద ఉన్న మోజుకొద్దే తన్ను వివాహమాడాడా అని, అనుమానం వేసేది. ఒకచిన్నకోరికమీద ఉండే మమకారం కొద్దీ పెద్దవాటిని త్యాగంచేసే బలహీనులలో ఒకడుగా కనబడ్డాడు వేణు ఆమెకు. రచనల పిచ్చిలో పడి, తెలివితేటలుండీ కూడా పరీక్షలు పాడు చేసుకుని, అటు రచనలో స్థాయిని అందుకో లేకపోయినా, హాయిగా గడపవలసిన జీవితాన్ని కష్టాలపాలు చేసుకున్న వారిని గురించి తాను విన్నది. అది ఒక బలహీనతే అయితే వేణు కున్నది కూడా అటువంటిదే కావచ్చు. తానేదో ఘనకార్యంచేసి యితరులకు విరుద్ధంగా ప్రవర్తించానని అనిపించుకోవడంకోసం మాత్రమే తన్ను పెళ్లాడాడా అనే శంక కూడా ఉత్పన్నమైంది ఆమెలో. అది కారణంగా వేణుమీద ఆమెకుండే గౌరవం సన్నగిలింది.

ఒకరోజున పార్వతి పేపర్ తిరగేస్తుంటే వేణు పనిచేస్తున్న కాలేజీలోనే హిస్టరీ ట్యూటర్ పోస్టుకి వేకెన్సీ ఉన్నట్టు ప్రకటన కనబడింది. సాయంత్రం అదే విషయం వేణూతో ప్రస్తావించింది.

"మీ కాలేజీలో ట్యూటర్ వేకెన్సీ ఉందటగా?" అంది.

"అవును." అన్నాడు వేణు ముక్తసరిగా.

"చెప్పారు కాదేం?" అడిగింది.

"ఏం అప్లయి చేస్తావా?" కొంచెం ఆశ్చర్యంతో అడిగాడు.

"చెయ్యమన్నారా?"

"నీ యిష్టం" అన్నాడు వేణు ముభావంగా.

"మీ కిష్టం లేదా?" నిలబెట్టి అడిగేసింది పార్వతి.

"నా కెందుకిష్టం ఉండదు! అయినా నీకెందుకు శ్రమ. ఇటు యిల్లు దిద్దుకోవడం, అటు ఉద్యోగం నీకు డబుల్ స్ట్రెయిన్ అవదూ?" గోడమీదపిల్లి వాటంగా అన్నాడు వేణు.

"నాకు కష్టం ఏముంటుంది? ఇంట్లో కూర్చుని ఏం చెయ్యడానికి తోచకుండా ఉంది. తొమ్మిదిగంటలకి వంటఅయితే సాయంత్రందాక ఊరికే కూర్చోడమే నాయె, ఒంటిగంటకి మీరొచ్చినప్పుడు తప్ప. ఇంకో వంవరాళ్లు వస్తే చన్నీళ్ళకి వేణ్ణీళ్లు తోడుగా ఉంటుంది కూడాను."

"మరి బాబుమాట!"

"వాణ్ణి కాన్వెంటుకి పంపిద్దాం. పొద్దున్న మనతో తీసుకెళ్లి సాయంత్రం మనతో తీసుకొచ్చెయ్యొచ్చు..."

"నీకు అవస్థ అనే ఆలోచిస్తున్నాను." పునరుద్ఘాటించాడు వేణు.

"నాకేం బాధ ఉండదు."

"అయితే నా అభ్యంతరం ఏముంది! రేపు అప్లయి చెయ్యి. ప్రిన్సిపాలుకి చెప్తాను." అన్నాడు.

మొన్నాడు పార్వతి అప్లయిచేసింది. ఉద్యోగం అయింది.

ఉద్యోగం ధర్మమా అని ఆమెకు ఆలోచనలకు తీరిక కొంత తగ్గి విశ్రాంతి లభించింది. పొద్దున్నించి రాత్రివరకు ఏదో పనితోనే సరిపోతుండడంవల్ల వేణుతో వాదనలకుగాని, పోట్లాడుటకుగాని ఆమెకు తీరికా ఓపికా కూడా లేకపోయేది.

పొద్దున్నే లేవడం కాల్యకృత్యాలు తీర్చుకుని కాఫీ కాచడం, ఆపైన వంట, భోజనాలు తొమ్మిదింటికి అన్నీ తెముల్చుకుని కారియర్‌లో బాబుకి మధ్యాహ్నం టిఫిన్, ఫ్లాస్కులో కాఫీ నింపి, తనకి ఫ్లాస్కునిండా కాఫీ నింపుకుని ముగ్గురూ రిక్షా ఎక్కేవారు. బాబుని కాన్వెంట్ దగ్గరవిడిచి సాయంత్రం వచ్చేటప్పుడు తిరిగి తీసుకువచ్చేవారు.

ఈ కొత్త జీవితం వేణూకి యిష్టం లేకపోయింది. కాని ఆమాట సూటిగా అనడానికి తనసంస్కారం అడ్డం వచ్చేది. అంచేతే పరోక్షంగా పిల్లిమీద ఎలకమీద పెట్టి కయ్యాలకు కాలుదువ్వేవాడు పార్వతీమీద. పార్వతి సహనం వహించిగాని, నిర్లిప్తతగాగాని మిన్నకుండేది. ఎంతఅణుచుకున్నా యీసంఘటనలు పార్వతిమీద తమ ప్రభావం చూపిస్తూనే ఉండేవి. తత్కారణంగా ఆమెలో విరక్తి ఎక్కువ కాసాగింది.

ఇలా సాగుతున్నవారి సంసారంలో మరొక అతిసామాన్యమైన విషయంమీదిచర్చ చినికిచినికి గాలివానై పరిస్థితుల పరాకాష్ఠకు తీసుకువెళ్లింది.

ఆవాళ మధ్యాహ్నంనించే పార్వతికి తలనొప్పి వచ్చింది. సాయంత్రానికి బాగా ఎక్కువై బాధపెడుతున్నా వేణుకి చెప్పలేదు. ముగ్గురూ రిక్షాలో యింటికి తిరిగివచ్చారు.

ఇంటికిరాగానే తినడానికేమైనా పెట్టమని పార్వతిని వేధించాడు బాబు. పార్వతి ఊరుకోపెట్టడానికి ప్రయత్నించింది. కాని వాడు మొండికేశాడు. అసలే తలనొప్పితో ఉండడంవల్ల సహనం కోల్పోయి వాణ్ణి రెండంటించింది వీపుమీద. వాడు యిల్లెగిరిపోయేటట్టు శోకాలు అరంభించారు.

హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటున్న వేణుకి బాబు ఏడుపు వినగానే పార్వతిమీద పట్టరానికోపం వచ్చింది. రెండంగల్లో వచ్చివాణ్ణి ఎత్తుకుని 'బుద్ధిలేదూ! ఎన్నిసార్లు చెప్పాలి వాడిమీద చెయ్యిచేసుకోవద్దని!' అంటూ విరుచుకుపడ్డాడు.

"విపరీతంగా విసిగించేస్తే!" విసుగ్గా అంది పార్వతి.

"సముదాయించడం చాతకాపోతేనే సరి! పిల్లలు కాకపోతే నువ్వూ నేనూనా అల్లరి చేసేది. ఏళ్లింతగానే సరి!" వెటకారంగా అన్నాడు.

ఆ మాటలు విన్న పార్వతికి వళ్ళు మండింది. ఇంతా చేస్తే తనంత గట్టిగా కొట్టనేలేదు. తండ్రి ఆసరా చూసుకునే వాడలా తయారయ్యాడు. అందుకే ఊరుకోలేక,

"మీకు లక్షసార్లు చెప్పాను నేనేమైనా అన్నప్పుడు వాణ్ణి వెనకేసుకు రావద్దని. మిమ్మల్ని చూసుకుని కాదూ వాడలా పేట్రేగిపోతూంట! మీరు వాడెదురుగుండానే నన్నిల్లా అంటే నేనంటే వాడికి లక్ష్యం ఎందుకుంటుంది? వాడు నాకు మాత్రంకొడుకు కాడూ? అకారణంగా నేను మాత్రం వాణ్ణి కొడతానా?" అంది.

"వాడికి ఆకలై ఉంటుంది. ఏదైనాచేసి పెడితే పోయె. అది లేదు సరిగదా వేలెడు వెధవమీద నీ ప్రతాపం చూపెడుతున్నావ్."

"నా కోపిక లేదు. అయినా వెధవకి పెంకితనానికి కాకపోతే నిజంగా ఆకలైందీ!"

"అవును మరి! ఇటు యిల్లు దిద్దుకోవడం అటు ఉద్యోగం—ఎంత కష్టపడిపోతున్నావ్!—వాడిమీద పడేడవకపోతే ఆ ఉద్యోగం మానెయ్యరాదూ?" అన్నాడు అక్కసుగా.

"అదన్నమాట అసలు మంట! ఆ మాత్రందానికి చెప్పెయ్యరాదూ మానెయ్యమని. మళ్ళీ అనడానికి మొహమాటం. ఎవరైనా వింటే ఆదర్శానికి భంగం వస్తుందని అభిమానం. ఎందుకీ వంచన?" అంటుంటే కోపంతో ఉడికిపోయిన ఆమె ముఖం ఎరుపెక్కింది.

"పార్వతీ!" అరిచాడు వేణు.

"ఎందుకు మళ్లీ కోపం, ఉన్నమాటంటే ఉలుకెక్కువ అని!" అంది పార్వతి విరసంగా.

"నోరు ముయ్!"అడుగు ముందుకు వేశాడు వేణు.

"అనవసరంగా నోరు పారేసుకోకండి! చెయ్యి చేసుకుందుకు అసలు ప్రయత్నించకండి!" కచ్చితంగాను, తీక్ష్ణంగాను అంది పార్వతి.

ఆ మాటల్లోని తీవ్రతికి వేణు ధైర్యం సడలింది. కాని అభిమానంతో మొహం జేవురించింది.

"నువ్విలా మారిపోతావని నేనే నేనాడో గ్రహించవలసింది!" అన్నాడు మాటలలోనే ఆమెను చిత్తు చేయాలని.

ఈమాటతో ఆమె కోపం భగ్గుమంది.

"నేనూ అమాటే అందా మనుకుంటున్నాను" అంది సమాధానంగా.

"ఎందుకనుకోవు! — నిన్నింత దాన్ని చేసి నీకోసం నా సర్వస్వం త్యాగంచేసి తలిదండ్రులకు, చుట్టాలకి దూరమైనందుకు నాకు తగిన ప్రతిఫలం యిస్తున్నావు. కృతజ్ఞత లేదు సరిగదా ఎదురు తిరుగుతున్నావు. ఈనాడు నువ్వూ నాలుగురాళ్లు తెచ్చుకోగల స్థితిలో ఉన్నావు గనక నా అవసరం నీకు లేదు. ఇంక నీయిష్టం వచ్చినట్లు, నువ్వెందుకు మాట్లాడవ్! — ఇంత చేసి చవటనయ్యాను నేను — నేను తలుస్తే పడక పోతే నీబతుకేమయ్యేది? ఈపాటికి కింకా మీ మామయ్యగారింట్లో అడ్డమైన చాకిరీచేస్తూ ప్రతిఫలంగా చీవాట్లు చెప్పుదెబ్బలూ పొందుతూండే దానివి. కూపస్థ మండూకంలా అంతమైపోవలసిన నీ బతుక్కో బాట చూపించాను. సంఘంలో నీకు ఒకస్థానం ఏర్పరిచాను. ఇన్ని విధాల నిన్నుద్ధరించినందుకు నాకు తగిన శాస్తి చేస్తున్నావు." గుండెలలో నాటేలాగ విసిరాడు వేణు.

ఆ దెబ్బతో తోక తొక్కిన పామైపోయిందామె.

"ఆపండి! నాగురించి మీ రిప్పుడైనా బాధపడక్కర్లేదు. నిశ్చింతగా నాదారికి నన్ను వదిలేసి మరొకర్ని మీకు నచ్చినవాళ్ళని చేసుకోండి. కాని మాట మాటకి నన్నిలా నీచపరచకండి — మీ రిన్ని కబుర్లు చెప్తున్నారే! మీ గురించి ఒక్కసారి మీరు తెలుసుకుందుకు ప్రయత్నించారా — మీరెంత స్వార్థమూర్తులు — కేవలం సంస్కారంమీది ప్రేమకొద్దీ నన్ను చేపట్టారు. వాదాలలో వచ్చిన పట్టుదల కొద్దీ నన్ను పెళ్ళిచేసుకున్నారు. నా బతుకుని ఉద్ధరించానన్న భావం మీకెంతో ఆనందాన్నిస్తుంది. అదే పోషించుకుంటూ వచ్చారు మీరు. దానికి మీరు కోరే ప్రతిఫలం — నాకు మీపట్ల యావజ్జీవకృతజ్ఞత ఉండాలి. అణగి మణగి మీకేమన్నా ఆ ఉపకృతి తల్చుకుంటూ మీమాట జవదాటకూడదు. నేనూ ఒకవ్యక్తిననీ, నాకూ ఒక వ్యక్తిత్వం ఉందనీ మర్చిపోవాలి — మన సంసారంలో మీకెంత బాధ్యత ఉందో నాకూ అంత ఉందని మీరు గ్రహించేందుకు సిద్ధపడరు. నేనూ ఒక మనిషిననీ, నాకూ స్వతంత్రంగా ఆలోచించే శక్తి ఉంటుందనీ మీరు ఒప్పుకుందుకు యిష్టపడరు. నేను కేవలం మీ చేతిలో ఒక ఆటబొమ్మలా ఉండి, కీలు ఎటు తిప్పితే అటు తిరిగి నవ్వమంటే నవ్వి, ఏడవమంటే ఏడ్చి, మీరు ఆడించినట్లల్లా ఆడితే మంచిదాన్ని, లేకపోతే కృతఘ్నురాల్ని, విశ్వాసఘాతకురాల్ని — అంతేనా అనుకుంటారు? —" గుక్క తిప్పుకోవటం కోసం ఆగింది.

వేణుముఖంలో అతి త్వరితంగా రంగులు మారిపోతున్నాయి. తను చెప్పదల్చుకున్న దేదో పూర్తిగా చెప్తేగాని విడిచి పెట్టనన్నట్టు మళ్ళీ పార్వతీ మొదలు పెట్టింది.

"మీరు మీవారి నందరినీ నాకోసమే వదిలేశారా? మరొక్కసారి ఆలోచించి చూడండి. ఒకవేళ నిజంగానే మీరంత త్యాగమూర్తులైతే పదే పదే దాన్ని చాటుకుని నాబలహీనతలని ఎందుకు ఎత్తి చూపుతారు! — కారు. మీరు త్యాగమూర్తులు కారు — మీ చర్యలన్నీ స్వార్థసంచితాలే! నన్ను చదివించడంలోకూడా మీస్వార్థమే కనుపించింది. ఒకవేళ మీకేదైనా ఊహించరాని ఆపద ఎదురైతే మీవంశాంకురమైన పుత్రుణ్ణి అగచాట్లనించి తప్పించి పెంచి పెద్దవాణ్ణి చెయ్యడానికి కావలసినశక్తి నాకివ్వడానికి చేసిన ప్రయత్నమే నాచదువు — ఇవన్నీ నేను ముందే గ్రహించి ఉండవలసింది. మీరు నిజంగానే ఆదర్శపురుషులని భ్రమపడి మోసపోయాను — మామయ్యగారింట్లోనే మగ్గిపోతే ఏమౌను అని అడిగారు — అక్కడే ఉంటే అసలు సుఖమున్నదే తెలియక కష్టాలు నన్నెక్కువ బాధించి ఉండేవి కావు. పరుపు మీద పడుకోవటం అలవాటు పడ్డవాడికే కటిక నేల మీద పడుకోవటం బాధనిపిస్తుంది — కాని యిప్పుడేమైంది? నేను ఒక మనిషిననీ, నాకూ ఒక వ్యక్తిత్వం ఉందని గ్రహించీకూడా వాటిని అవ్యక్తంగానే ఉంచేసి నోరుమూసుకుని ఉండమంటున్నారు మీరు. అదేనా న్యాయం? అసలు, తెలియకపోతే యిబ్బంది లేదుగాని, తెలిసి ఆత్మవంచన చేసుకోగలమా? — ప్రతి చిన్న విషయానికి మీ త్యాగాన్ని గుర్తుకి తెచ్చి నా వ్యక్తిత్వాన్ని అణచ ప్రయత్నించారు. నానోరు మూయించారు. కాని ఎన్నాళ్లుంటుంది సహనం? ఎప్పటికప్పుడు చెబుదామనే నిగ్రహించుకునేదాన్ని. ఇటువంటి రోజు వస్తుందని నాకెన్నడో తెలుసు. ఇన్నాళ్లీ చెముడోజను వాయినా వేస్తూ వచ్చాను — బాబుని జాగ్రత్తగా చూసుకోండి. నేనువెళ్లిపోతాను. లేదా నావెంట పంపిస్తానన్నా నాకభ్యంతరం లేదు —" నిశ్చితంగా అంది పార్వతి.

వేణుకి నోట మాట రాలేదు.